ఆ అధికారుల పనితీరుపై ప్రత్యేక నిఘా?



ఎల్‌బీనగర్‌: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్‌ మూడు సర్కిళ్ల అధికారుల పనితీరుపై విజిలెన్స్‌ అధికారులు నిఘా వేయడంతో పాటు అధికారుల పనితీరుపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇటీవల పలు అధికారులు, సిబ్బంది పనితీరుపై గ్రేటర్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో గ్రేటర్‌ కమిషనర్‌ ఎల్‌బీనగర్‌ మూడు సర్కిళ్ల అధికారుల పనితీరుపై రోజు వారీగా విజిలెన్స్‌ అధికారులకు నివేదికలు అందించాలని ఆదేశించడంతో విజిలెన్స్‌ అధికారులు వారిపై నిఘా పెట్టి సమాచారం సేకరిస్తున్నారు. ప్రధానంగా శానిటేషన్‌, టౌన్‌ప్లానింగ్‌, జనన మరణ ధ్రువపత్రాలు, ఎంటమాలజీ విభాగాలపై అధికంగా ఫిర్యాదులు ఉండడంతో వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారనే పలువురు పేర్కొంటున్నారు.బర్త్‌ అండ్‌ డెత్‌ విభాగంలో వేల కొద్ది ఫైల్స్‌ పెండింగ్‌లో ఉండడం రోజు రోజుకు పెరుగుతుండడంతో రోజుల తరబడి కార్యాలయం చుట్టు తిరిగినా పని కాకపోవడంతో పలువురు అధికారులపై అసహనాన్ని వ్యక్తం చేస్తుండగా మరి కొంతమంది మాత్రం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. శానిటేషన్‌ విభాగంలో ఎస్‌ఎఫ్‌ఏలే అంత తామే అనట్టు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. ముడుపులు అందిస్తే నిబంధనలు పక్కకు పెట్టి వెంటనే పత్రాలు జారీ చేస్తారు. ట్రేడ్‌, ఫుడ్‌ తదితర లైసెన్స్‌ల జారీలో శానిటేషన్‌ పనులు పక్కన పెట్టి లైసెన్స్‌ల జారీ దందాకు అధికారులు తెర లేపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌ఎఫ్‌ఏలు కార్మికుల నుంచి నెల నెల మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ఇటీవల కొంతమంది కార్మికులు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. రోజు రోజుకు వస్తున్న ఫిర్యాదులకు అధికారులు తలలు పట్టుకుంటే వాటిపై దర్యాప్తులు విజిలెన్స్‌ అధికారులు నిఘా ఏర్పాటు చేసి ఆరా తీస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో తులాభార అభిషేక మహోత్సవం



నాగోలు: కొత్తపేట భవానీ చౌరస్తాలోని శ్రీ భవానీ మందిరంలో మహాశివరాత్రి అక్షర తులాభార లక్ష రుద్రాక్షల అభిషేక మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయం చైర్మన్‌ భావన ఋషి వీరమల్ల కాటంరాజు ఆధ్వర్యంలో వేద పండితుడు కోటేశ్వరరావు రూపాయి నాణేలు,లక్ష రుద్రాక్షలతో తులాభారం అభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. లక్ష రుద్రాలతో మహా శివలింగేశ్వరుడికి నరదిష్టి నివారణ అభిషేకం, అఖండ శివ పంచాక్షరి మంత్రం, జపం, తర్పణం, హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా మృత్యుంజయ పాశుపత రుద్ర, దుర్గా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

యూజీడీ పనులను వెంటనే ప్రారంభించాలి

మన్సూరాబాద్‌: మంజూరైన భూగర్భ డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి జలమండలి, సివరేజీ బోర్డు జనరల్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌రెడ్డిని ప్రజావాణి కార్యక్రమంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను గుర్తించి మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. డివిజన్‌లోని ప్రతికాలనీలో డ్రైనేజీలు పొంగుతూ మురుగు రోడ్లపై పారుతూ ఇబ్బందికరంగా ఉంటుందని వివరించినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన యూజీడీ పైపులైన్లను ఆధునీకరించాలని కోరినట్లు స్పష్టంచేశారు. కొన్ని కాలనీలో లోప్రెషర్‌తో తాగునీటి సరఫరా అవుతుందని, సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విన్నవించినట్లు కార్పొరేటర్‌ తెలిపారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి

సేవాలాల్‌ మహరాజ్‌ ఆదర్శప్రాయుడు



సేవాలాల్‌ జయంతి వేడుకల్లో పాల్గొన్న సింగరేణి గుడిసెవాసులు

సైదాబాద్‌: సద్గురు సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ అందరికీ ఆదర్శప్రాయుడని సింగరేణి కాలనీ గుడిసెవాసుల సంఘం అధ్యక్షుడు సేవ్యా నాయక్‌ అన్నారు. సోమవారం ఐఎస్‌సదన్‌ డివిజన్‌ సింగరేణి కాలనీ సేవాలాల్‌ బంజారా సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్‌ మహరాజ్‌ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజన మహిళలు సాంప్రదాయబద్ధంగా గీతాలు ఆలపించి, బంజారా నృత్యం చేసి అలరించారు.ఈ సందర్భంగా సేవ్యానాయక్‌ మాట్లాడుతూ.. ప్రతీయేడు సింగరేణి కాలనీలో బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్‌ జయంతి వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. 30 ఏళ్లగా సింగరేణిలో నివసిస్తున్న గిరిజన, దళిత, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్రునాయక్‌, నర్సింహా నాయక్‌, లక్ష్మణ్‌ నాయక్‌, శ్రీను నాయక్‌, రామ నాయక్‌, పాండు నాయక్‌, ఎల్లమ్మ, బుజ్జి నాయక్‌, సేలా బాయి, బాలు నాయక్‌ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

మన్సూరాబాద్‌: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని వాటర్‌ వర్క్స్‌ జనరల్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాగోలు డివిజన్‌ డివిజన్‌ పరిధి రాక్‌టౌన్‌కాలనీలో మంచినీరు లోప్రెషర్‌తో సరఫరా అవుతుందని కాలనీవాసులు ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జంక్షన్‌ వాల్స్‌ స్ట్రక్‌ అవ్వడంతో సమస్య తలెత్తిందని, నూతన జంక్షన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, సెక్రటరీ జైపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.



లోప్రెషర్‌ను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు చివరి తేదీ 28

చాదర్‌ఘాట్‌: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు ఈ నెల 28 చివరి తేదీ అని సర్కిల్‌–6 డీసీ జయంత్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 352 దరఖాస్తులు వచ్చాయని వెరిఫికేషన్‌ అనంతరం అర్హులకు ఫోన్‌ ద్వారా సమాచారం ఇస్తామన్నారు.

- గ్రేటర్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు ప్రాపర్టీ ట్యాక్స్‌ పరిష్కారం కార్యక్రమానికి శని, ఆదివారాల్లో 10 దరఖాస్తులు వచ్చాయని డీసీ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సర్కిల్‌ పరిధిలో దాదాపు రూ. 23 లక్షలు ప్రాపర్టీట్యాక్స్‌ వసూలైందన్నారు.
- కొత్తరేషన్‌ కార్డుల జారీ ప్రక్రియ మార్చి 1 నుంచి జరుగుతుందని డీసీ తెలిపారు. మలక్‌పేట నియోజకవర్గంలో కొత్త రేషన్‌కార్డుల కోసం 2973 అర్హులుగా గుర్తించామని వారందరికి మార్చి 1న కార్డులు జారీ చేస్తామన్నారు.
- ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్‌–6లో అక్రమ కట్టడాలపై రెండు ఫిర్యాదులు అందాయని డీసీ తెలిపారు.

తాళాలు పగులగొట్టి పార్కులను ప్రారంభిస్తా

● ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి కుంటుపడింది ● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎల్‌బీనగర్‌కు నూతనంగా 15 పార్కులు మంజూరు చేసిందని, వాటిలో ఆరు పార్కులపై కోర్టు కేసులున్నాయి. మరో ఆరు పార్కులు 2023 నవంబర్‌లోనే పూర్తయ్యాయి. వాటిని అందుబాటులోకి తీసుకురావాలని పలుమార్లు అధికారులను కోరినా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పార్కులు ప్రారంభానికి నోచుకోవడం లేదని పూర్తయిన పార్కులను రెండ్రోజుల్లో ప్రారంభించకుంటే తాళాలు పగులగొట్టి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్‌ కేబీఆర్‌ కన్వెన్షన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ జోక్యం, ఓటమి పాలైన అభ్యర్థి అవగాహన లోపంతో ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి కుంటు పడుతుందని ఆగ్రహం చెందారు. ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషన్‌ కాంగ్రెస్‌ పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆరోగ్యం బాగోలేక కొద్ది రోజులు ఇంటి వద్దనే ఉండాల్సి వచ్చిందని, నా ఆరోగ్యంపై ప్రతిపక్ష పార్టీల నేతలు దుష్ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందారని అన్నారు. క్యాన్సర్‌ వచ్చిందని, ఉప ఎన్నిక వస్తుందని తప్పుడు ప్రచారం చేసి పైశాచిక ఆనందం పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ నాయకులు, బీజేపీ కార్పొరేటర్లు చిల్లర రాజకీయాలు మానుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎల్‌బీనగర్‌జోన్‌ పరిధిలోని 23 డివిజన్లకు కేవలం రూ.4 కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్‌ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్రయాదగిరి, జగదీష్‌గౌడ్‌, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆనంద్‌, రవి ముదిరాజ్‌, ఆనంద్‌ పాల్గొన్నారు.



సుష్మాచౌరస్తా వద్ద ఎండలో బస్సుకోసం పడిగాపులు

బస్సు ఎక్కాలంటే ఎండలో నిలబడాల్సిందే!

- రహదారుల విస్తరణతో తొలగించిన షెల్టర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేయాలని వేడుకోలు

హస్తినాపురం: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గం పరిధిలోని విజయవాడ, నాగార్జునసాగర్‌ జాతీయ రహదారులపై బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండలోనే పడిగాపులు కాస్తున్నారు. నాగార్జున సాగర్‌ జాతీయరహదారిపై హస్తినాపురం చౌరస్తా బస్టాప్‌ దగ్గర షెల్టర్‌ లేకపోవడంతో ఇబ్రహీంపట్నం, మల్లేపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణికులు ఎండలోనే గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై సుష్మాచౌరస్తా, పనామా చౌరస్తా దగ్గర ఉన్న బస్టాప్‌లలో ఒక్క షెల్టర్‌ కూడా లేదు. రోజురోజుకు ఎండలు పెరుగుతుండడంతో చెట్లు, దుకాణాల నీడను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులు, వృద్ధులు ఎండకు తట్టుకోలేక నానా ఇక్కట్లకు గురవుతున్నారు.



హస్తినాపురం చౌరస్తా వద్ద ఎండలో బస్సుకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఉన్న షెల్టర్లు తొలగించారు..

సాగర్‌ రహదారిపై సాగర్‌ కాంప్లెక్స్‌ నుంచి మొదలుకొని బీఎన్‌రెడ్డినగర్‌, హస్తినాపురం, అనుపమానగర్‌, ఓంకార్‌నగర్‌, మీదుగా సాగర్‌రింగ్‌రోడ్డు వరకు, విజయవాడ జాతీయరహదారిపై హయత్‌నగర్‌ నుంచి మొదలుకొని లెక్చరర్స్‌కాలనీ, హయత్‌నగర్‌ బస్సుడిపో, భాగ్యలతకాలనీ, హైకోర్టు కాలనీ, ఆటోనగర్‌, వనస్థలిపురం, చింతలకుంట మీదుగా ఎల్‌బీనగర్‌ రింగ్‌ రోడ్డువరకు ఉన్న బస్టాప్‌లలో చాలా వరకు షెల్టర్‌లు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల మూలంగా అక్కడక్కడ ఉన్న షెల్టర్‌లు పూర్తిగా తొలగించడంతో ప్రయాణికులు ఎండలోనే రోడ్డుపై నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి బస్సులు ఆగే చోట షెల్టర్లు ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పనామాచౌరస్తా వద్ద..

ప్రతిభకు అవిటితనం అడ్డుకాదు

చంచల్‌గూడ: దివ్యాంగులను మరింత ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌ నవాబు శివకుమార్‌గౌడ్‌ అన్నారు. భారత్‌ దివ్యాంగుల క్రికెట్‌ జట్టు సభ్యుడు ధనావత్‌ వస్రం నాయక్‌ ఇటీవల నేపాల్‌ జట్టుతో టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. సోమవారం ధనావత్‌ సూపరింటెండెంట్‌ శివకుమార్‌ను కలువగా ఆయన అభినందించారు.

కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలు పెంచాలి

ఎల్‌బీనగర్‌: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత కేశవ్‌ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్‌ కార్మికులుగా పనిచేస్తున్న వారి వేతనం రూ 26వేలు, శానిటరీ ఫీల్డ్‌ సహాయకులుగా పనిచేస్తున్న వారికి రూ.35వేలు, ఎండ తీవ్రత పెరిగినందున పారిశుద్ధ కార్మికులను ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకే పని చేయించాలన్నారు. గ్రేటర్‌ పరిధిలో సుమారుగా 26 వేల మంది కార్మికులు పనిచేస్తున్నా ఇప్పటి వరకు వారిని పర్మనెంట్‌ చేయలేదని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో ఎల్లయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో యువకుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: పెళ్లి పేరుతో యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో యువకుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. కోర్టు ఏపీపీ పి.మంజులాదేవి వివరాల ప్రకారం.. కందుకూరు ఠాణా పరిధలోని పులిమామిడి గ్రామానికి చెందిన శ్రీనాథ్‌ అదే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతిని ప్రేమ, పెళ్లి పేరుతో లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2017లో యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి గురించి ప్రస్తావించగా ముఖం చాటేస్తూ తిరిగేవాడు. మోసపోయినట్లు గ్రహించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేసారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.వాణి సోమవారం నిందితుడికి జైలు శిక్ష, బాధితురాలికి రూ. 3 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేస్తూ తీర్పునిచ్చారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

సైదాబాద్‌: హైదరాబాద్‌ జిల్లా వ్యవసాయ మార్కెట్‌ పరిధిలోని మలక్‌పేట మార్కెట్‌లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌ సోమవారం జోనల్‌ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేట మార్కెట్‌ యార్డులో అక్రమ నిర్మాణాలపై గతంలోనూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని మార్కెట్‌ నిబంధనలను తుంగలో తొక్కుతూ పలువురు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్‌ యార్డులో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జెడ్సీకి ఫిర్యాదు చేస్తున్న కోట్ల శ్రీనివాస్‌



ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న అధికారులు, ధర్మకర్తలు

నూతన కమిటీ నియామకం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌ మారుతి మందిర్‌ ధర్మకర్తల నూతన కమిటీని నియామిస్తూ దేవాదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఫౌండర్‌ ట్రస్టీ మెంబర్‌ కనుమూరి సీతారామరాజు, ధర్మకర్తలు చిట్టంపల్లి కిరణ్‌కుమార్‌, బి.సంధ్య, గడ్డ నరేందర్‌, బొట్టు శ్రీనివాస్‌, శ్యామ్‌ రాజ్‌, గొని చంద్రయ్య, అర్చక ఎక్స్‌ అఫీషియల్‌ మెంబర్‌గా ఆర్‌.ప్రహ్లాద శర్మ నియమితులయ్యారు. మారుతి మందిర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌ జిల్లా అసిస్టెంట్‌ కమిషనర్‌ శేఖర్‌, ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, ఈఓ రవీందర్‌రెడ్డిల సమక్షంలో నూతన ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు.

రంజాన్‌కు సౌకర్యాలు కల్పించాలని వినతి

పహాడీషరీఫ్‌: ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉండే ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా వార్డుల్లో చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్‌ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫూద్దీన్‌ హామెద్‌, మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు షేక్‌ అఫ్జల్‌ కోరారు. ఈ మేరకు సోమవారం జల్‌పల్లి మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మజీద్‌ల పరిసరాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టి చెత్తాచెదారాలు లేకుండా చూడాలన్నారు. రహదారులపై నెలకొన్న గోతులను మొరంతో పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి పూట చాలా బస్తీలలో వీధి దీపాలు వెలగడం లేదని, వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా బోర్లను రిపేర్‌ చేసి.. అవసరమైతే వాటర్‌ ట్యాంకర్లతో కూడా నీటి సరఫరా చేయాలని కోరారు. ఆయనను కలిసి వారిలో నాయకులు అలీ మన్సూరీ, సయ్యద్‌ అబ్బాస్‌, ఆరీఫ్‌ అలీ, సలీం, అజీం, హఫీజ్‌ తదితరులు ఉన్నారు.



మూసీ కార్పొరేషన్‌ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్‌

వనస్థలిపురం: అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానని చెప్పి కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మూసీ కార్పొరేషన్‌ చైర్మన్‌గా చేసిందేమీ లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ విమర్శించారు. సోమవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్‌, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. సుధీర్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నారని జీఓ 118 పేరుతో పనికిరాని డాక్యుమెంట్‌ చేతిలో పెట్టి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇసుక లారీల అడ్డాను టీజీఐఐసీ స్థలంలోకి తరలించి ఉచితంగా పార్కింగ్‌ సదుపాయం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు ప్రైవేటు వారికి ఆ స్థలాన్ని కేటాయించి లారీ యజమానులను మోసం చేశారని విమర్శించారు. సుధీర్‌రెడ్డి ఆరోగ్యంపై దుష్ప్రచారం చేసే దుర్బుద్ధి కాంగ్రెస్‌ నాయకులకు లేదని, అది బీఆర్‌ఎస్‌ నాయకులకే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట, లక్ష్మీనగర్‌ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. సుల్తానాఅల్వా, వినయ్‌నగర్‌ 33/11 కేవీ విద్యుత్‌ ఫీడర్ల పరిధిలోఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కటకోనికుంట, చంపాపేట పాతబస్తీ, సాయిరాంనగర్‌, సుల్తానాఅల్వా, బస్తీ దవాఖానా పరిధి, రాజిరెడ్డి నగర్‌, కృష్ణానగర్‌, వినయ్‌నగర్‌, ఎస్‌ఎస్‌ఆర్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌ క్వాటర్స్‌, చంపాపేట, శ్రీనివాసనగర్‌, బాలాజీనగర్‌ కాలనీల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.25, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్‌ రూ.17, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.23, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.08, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.43, మునగ రూ.55, కందగడ్డ రూ.65, బీట్‌రూట్‌ రూ.17, కీర రూ.23, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



ప్రజావాణిలో పాల్గొన్న డీసీ తిప్పర్తి యాదయ్య

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ జోనల్‌ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టౌన్‌ ప్లానింగ్‌ విభాగానికి చెందిన ఫిర్యాదులే అధికంగా రావడం విశేషం. జోనల్‌ పరిధి ఐదు సర్కిళ్ల పరిధిలో 13 ఫిర్యాదులు రాగా టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలోనే 10 ఫిర్యాదులు అందాయని అధికారులు పేర్కొన్నారు. మిగతా వాటిలో ట్యాక్స్‌ శానిటేషన్‌లపై మూడు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

ఐడియల్‌ ఉమెన్స్‌ డిగ్రీ కళాశాలకు న్యాక్‌ గుర్తింపు

మలక్‌పేట: తమ కళాశాల న్యాక్‌ (నేషనల్‌ అసెస్‌మెంట్‌ అండ్‌ అక్రిడిటేషన్‌ కౌన్సిల్‌) గ్రేడ్‌ గుర్తింపు పొందడం గర్వకారణమని దిల్‌సుఖ్‌నగర్‌ ఐడియల్‌ ఉమెన్స్‌ డిగ్రీ కళాశాల సెక్రటరీ సీతారామరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా ప్రక్రియలు, ఫలితాలు, పాఠ్యాంశాలు కవరేజ్‌, బోధన అభ్యాస ప్రక్రియలు, అధ్యాపకులు, పరిశోధన, మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు, సంస్థ పాలన ఉన్న విద్యాసంస్థలను న్యాక్‌ మూల్యంకనం చేసి గుర్తింపు ఇస్తుందన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పహాడీషరీఫ్‌: కోట్లాది రూపాయల వ్యయంతో శ్రీరాం కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టామని జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు కెంచె లక్ష్మీనారాయణ, ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్‌ పేర్కొన్నారు. రూ.50లక్షల హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న శ్రీరాం కాలనీలోని ప్రభుత్వ పాఠశాల నుంచి బస్టాప్‌ వరకు సీసీ రోడ్డు, దిగువకు బీటీరోడ్డు నిర్మా ణ పనులను సోమవారం కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు షేక్‌ జహంగీరుద్దీన్‌తో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రస్తుతం పదవిలో లేకున్నా ప్రజల మధ్యే ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్న రవికుమార్‌, మున్సిపాలిటీ సూపర్‌వైజర్‌ బుడుమాల కుమార్‌ పాల్గొన్నారు.

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



బాలాజీ

మలక్‌పేట: కూలి పనుల కోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నవీన్‌ వివరాల ప్రకారం.. సైదాబాద్‌ డివిజన్‌ గాంధీనగర్‌కు చెందిన బాలాజీ(50) ఈ నెల 21న కూలి పనులకు కోసమని మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లి రాత్రైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హయత్‌నగర్‌ పరిధిలో..



శ్రీజ

లింగోజిగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..పెద్దఅంబర్‌పేట, సాయినగర్‌ కాలనీ చెందిన పిన్నపురాల శ్రీజ(23) ఇంటర్‌ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. సోమవారం తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా శ్రీజ కనిపించలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారితో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.